# చిక్కులు

సికింద్రాబాద్‌లోని మోండా మార్కెట్టుకు వెళ్ళి కూరగాయలు కొనుక్కోడానికి భయం అని కాదు కాని ఆండాళ్ళు కళ్ళల్లో ఎక్కడ పడతాననేమో అనిపిస్తుంటుంది. ఆమెను చూసింది ఒక్కసారే. అయినా ఇప్పటికీ నాకు ఆమె ముఖం గుర్తు ఉంది. ఆమెకు ముప్పయి అయిదు సంవత్సరాల కన్నా ఎక్కువ వయసు ఉండదు. అంతలావూ కాదు, సన్నమూ కాదు. చామనచాయ కూడా కాదు, నలుపు. అయినా చక్కగా ఉంటుంది. మళ్ళీ మళ్ళీ చూడాలనిపించేంత అందంగా ఉంటుంది. పెద్ద బుట్ట నిండా వంకాయలు ముందు పెట్టుకుని మెట్లమీద కూర్చుని ఉంటుంది.

ఈ సంఘటన జరిగి ఆరునెలలు పయిగా అయినా ఆమె రోజుకు ఒకసారయినా నాకు గుర్తు వస్తుంటుంది.

మోండా మార్కెట్టు ఉదయం పూట క్రిక్కిరిసి ఉంటుంది. మరీ ముఖ్యంగా ఆదివారాలయితే కాలు తీసి వేయడానికయినా స్థలం ఉండదు. ఒక్క మనిషి కదలడానికే జాగా ఉంటుంది. మళ్ళీ సాయంత్రాలు అంత రద్దీగా ఉండదు. ఉదయం వెళ్తే తాజా కూరగాయలు దొరుకుతాయి. ధర తక్కువగా ఉంటుంది. సాయంత్రం కూరగాయలు తాజాగా ఉండవు. ధర ఉదయం కన్నా ఎక్కువగానే ఉంటుంది. ఒకసారి వెళ్తే రెండు వారాలకు సరిపడే కూరగాయలు తెచ్చుకుని ఫ్రిజ్‌లో పెట్టేసుకుంటాను. దేనికోసం తడుముకోవలసిన అవసరం ఉండదు.

ఆరోజు కూరగాయలు కొంటూ ఆండాళ్ళు వంకాయల బుట్ట ముందు ఆగి వంగి చూడసాగాను. వంకాయలు నిగనిగలాడుతూ మంచిగా ఉన్నాయి. నాకు వంకాయ కూరంటే ఇష్టం. వంకాయలతో ఇరవయి రకాలకు పయిగా కూరలు చేయొచ్చు. నాకు పెళ్ళి కాలేదు. అయినా వంటల్లో మంచి నేర్పు ఉంది. మళ్ళీ నాన్నకు నా అంత నేర్పు లేదు. చివరి వరకు అమ్మ వంట మీద ఆధారపడుతూ

వచ్చాడు. నేను పెద్ద ఎత్తునేం వంటచేయలేనుకాని నా వంటకాలతో కొద్దో గొప్పో పేరు తెచ్చుకోవడం వలన పక్కిళ్ళ ఆడవాళ్ళు నన్ను గుర్రుగా చూడడం మొదలెట్టారు. గమ్మత్తేమిటంటే ఒకరికి తెలియకుండా మరొకరు వచ్చి ఏఏ కూరలు ఎలా చేయాలో తెలుసుకుని వెళ్ళిపోతుంటారు.

మార్కెట్టులో మనుషులెంత రద్దీగా కదులుతుంటారో ఆవులూ, ఎద్దులూ ,మేకలు మనుషులను రాసుకుంటూ వెళ్ళిపోతుంటాయి . లెక్కచేయవు. ముడుపు ముట్టని ట్రాఫిక్ పోలీసులా ఎంత గదిమినా మాట వినవు. వాటిమానాన వాటిని పోనిచ్చేస్తుంటారు. వంకాయలు ఏరడంలో మునిగినపోయిన నేను ఒరుసుకుంటూ వెళ్ళిన ఎద్దు ధాటికి నిలబడలేక గరిమనాభి తప్పి ఆండాళ్ళు ఒడిలో పడ్డాను. తమాయించుకుని ఉండాల్సింది. నేను ఏమాత్రం ఊహించని సంఘటన అది. అలా తూలి పడడంలో అసలే వదులుగా ఉండి ఎప్పుడెప్పుడు జారిపోదామా అని ఉన్న నా కళ్ళద్దాలు ఆమె వడిలో పడ్డాయి. వాటిని వెతుక్కుంటోంటే, వంకాయ ఉన్న చేత్తో నా తల నిమురుతూ, “ఏమిటా పని? ఎవరయినా చూస్తే బావుండదు. లే.” అంది. నిజానికి నామీద అరుస్తుందని అనుకున్నాను. అరవకపోయేసరికి నేనేమి అనువుగా తీసుకోలేదు. పెళ్లి కాకపోయినా నాకు అటువంటి ఉద్దేశం లేదు. ఆ మాట కొస్తే మా ఇంట్లో మగాళ్ళ కన్నా ఆడవాళ్ళే ఎక్కువ మసలుతుంటారు. నా చేతికి వెంటనే కళ్ళజోడు దొరకబట్టి అట్టే సమయం తీసుకోకుండా ఆమె మీంచి లేవగలిగాను. అంత త్వరగా నేను లేవడం ఆమెకు ఇష్టమయినట్టు అనిపించలేదు. నవ్వింది. అవసరం లేకపోయినా ఎక్కువ వంకాయలే తీసుకున్నాను. అరకిలో ఎక్కువే కొలిచి కిలోకే డబ్బులు తీసుకుంటూ, “వంకాయలు ఇక్కడే కొంటూండు, ఏం పేరు నీది?” అడిగింది. చెప్పాను. “రెండు నిమిషాలు ఆగకూడదూ టీ తెప్పిస్తాను” అంది. ఉండేవాడినే. కొద్దిదూరంలో నా వయిపే వస్తూ ఎద్దు కనిపించేసరికి నాకు ఆవేళ ఎద్దుగండం లాటిదేమయినా ఉందేమో అనిపించి భయం వేసి అక్కడినుండి కదులుతోంటే, “వస్తూండు” అంది. తలూపానో, లేదో గుర్తులేదు. ఏమనుకుందో, ఏమో ఎద్దు యు టర్న్ తీసుకుని వెళ్ళిపోయింది. గండం ఆ రోజుకు గడిచింది.

నాకు పుదీనా పచ్చడి అంటే చాలా ఇష్టం. నా చిన్నప్పుడు అమ్మ వారానికి ఒకసారయినా పుదీనా పచ్చడి చేస్తుండేది. చాలా బాగా చేసేది. నాకు వంట వచ్చాక పదీ, పదిహేను సార్లు చేయడానికి ప్రయత్నం చేశాను. కుదరలేదు.

కుదరలేదని చెప్పకుండా పక్కిళ్ల వాళ్ళకు పందారం చేశాను. ఒకరింట్లో విరోచనాలు కట్టుకున్నాయట. వేరే వారి ఇంట్లో విరోచనాలు మొదలయినాయట. ఈ వ్యత్యాసం నాకు అర్థం కాలేదు. ఏదేమయినా అందరికి సరిసమానంగా ఉండాలి కదా!

పుదీనా పచ్చడి గురించి వంటలు చెప్పే టి.వి. వాళ్లను అడిగాను. వాళ్లకూ తెలిసినట్టుగా అనిపించలేదు. క్రియేటివ్ ఎసెన్స్‌లా అనిపించిందేమో ఒక్కొక్కరు ఒక్కో విధంగా చెప్పారు. ఒకామె మటుకు కాల్గేట్‌లా నవ్వి "వెజిటబుల్ చికెన్ గురించి అడగండి. చెప్తాను. ఈ పచ్చళ్లు పట్టుకు వేళ్లాడుతుంటారెందుకు? అయినా, మీ మగాళ్ల కెందుకు వంట సంగతులు?" అడిగింది. వెజిటబుల్ చికెన్ మీద నా ఆలోచనలు కదిలేసరికి ఆమె ప్రశ్నకు జవాబు కయి వెతుక్కునే లోపల ఆమె ఫోను పెట్టేసింది. మళ్లీ ఎంత ప్రయత్నం చేసినా ఆమె దొరకలేదు. చివరి ప్రయత్నంగా భారతిని అడిగాను. ఆమెతో నాకు పరిచయం లేదు. వంటలు చేయడంలో మంచి అనుభవం ఉందని తెలిసిన వాళ్లెవరో నాకు ఆమె ఫోను నెంబరిస్తే నన్ను నేను పరిచయం చేసుకుంటూ వంటా వార్పుల్లో నాకు అనుభవం ఉన్న సంగతి దాచిపెట్టి, "పుదీనా పచ్చడి ఎలా చేయాలో చెప్పమని" అడిగాను. ఆమె చాలా బిజీ వ్యక్తి అనుకుంటాను, నాకు అట్టే సమయం ఇవ్వలేదు. అందరి భర్తల్లాటి వాడే అనుకుంటుందని నేను బ్రహ్మచారినని చెప్పుకోవడం వలనో, ఏమో, "పచ్చళ్ల మీద ముచ్చట్లు అనే పుస్తకం రాశాను. మీ చిరునామా చెప్తే ఆ పుస్తకం మీకు పువ్వుల్లో పెట్టి పంపిస్తాను" అంది. నిజంగానే పువ్వుల్లో పెట్టి పంపిస్తుందని అనుకున్నాను. ఆ వారంలోనే వి.పి.పి. లో 'పచ్చళ్ళ మీద ముచ్చట్లు' పంపించింది. అందులో పుదీనా పచ్చడి గురించి ఎక్కడా రాయలేదు. పుస్తకంలోని మొదటి పేజీల్లో 'గృహశోభ' పత్రిక సంపాదకురాలి ముందు మాటలు ఉన్నాయి. భారతి ప్రచురించే ముందు అవి చదువుకుని ఉండదు. ప్రచురించాక చదువుకుందామని అనుకుని ఉండి ఉండాలి. ఆ మాటల్లో భావభేదం చాలా ఉంది. ఆమె మాటల్లో పొగడ్త కన్నా అది చదివి వంటలు చేసి భర్తలను నానా విధాలుగా ఏడిపించవచ్చని, విడాకులు తీసుకోడానికి చక్కగా ఉపయోగపడుతుందని కుండలు బద్దలుకొట్టినట్లు చెప్పింది. ఆ మధ్య కుండల ధర ఎంతో పెరిగిపోతే ఎందుకో నాకు ఆ పుస్తకం చదివాక అర్థం అయింది. విడాకులు ఇప్పించే లాయర్లకు ఆ పుస్తకం ఎంతో ఉపయోగపడి ఉండొచ్చు. అది ఎనిమిదో ముద్రణ. అందులోనూ అయిదువేల కాపీలు. తెలుగులో వంటబట్టని స్థితి. ఇంగ్లీషు నుండి మూడో కంటికి తెలియకుండా తెలుగులోకి కాపీచేసిన

నవలల్లా వ్యక్తిత్వ వికాసపు తర్జుమాల్లా బాగానే అమ్ముడయ్యాయి.

నా సమస్య మటుకు అలానే ఉండిపోయింది. విసుక్కుంటే విసుక్కోనీ అనుకుని భారతికి ఫోను చేసి ఆమె పుస్తకం గురించి ఇష్టమొచ్చినట్లు పొగిడి, పుదీనా పచ్చడి గురించి అడిగాను. మంచి మూడ్‌లోనే ఉంది. ఓపికగా పచ్చడి మనకు ఇష్టమయిన వాళ్ళకు ఎలా చేసిపెట్టాలో, ఇష్టంలేని వాళ్ళకు ఎలా చేసి పెట్టాలో వివరంగా చెప్పింది. నాకా కాన్సెప్ట్ చాలా బాగా నచ్చింది. పచ్చడి ఎలా చేయాలో నాకు అర్థం అయింది. చివర్లో, ఎన్ని నీళ్ల పోయాలని అడిగాను. రెండు రోజులకొకసారి మంచినీళ్ళు వస్తున్నప్పటినుండి నీళ్ల విషయంలో జాగ్రత్తగానే ఉంటున్నాను. ఆమె వెంటనే జవాబు చెప్పలేదు. "ఒక కప్పు లేక ఒక గ్లాసు నీళ్లు పోయమంటారా?" అడిగాను. "అబ్బెబ్బే అంతొద్దు.. పుక్కిడి చాలు. అవే ఎక్కువ" తనకు అలవాటయిన మామూలు విషయంలా అంది. నేను ఫోను పెట్టేద్దామనుకునేంతలో తనే ఫోను పెట్టేసింది. కడుపులో దేవినట్టనిపించింది. పుదీనా పచ్చడి చేసుకుని తినాలన్న ఆలోచన విరమించుకున్నాను. ఇహ ఎవరు చేసి తీసుకొచ్చి ఇచ్చినా తినలేనేమో!

మా పనిమనిషి పేరు సునీత. మొదట్లో మా ఒప్పందం ఏమిటంటే నేను నెలకు పదిహేను వందల రూపాయలిస్తే ఆమె నాకు రెండు పూటలా వంటచేసి పెడుతుంది. మొదటి రెండు నెలలూ సమయానికి వచ్చి టి.వి. సీరియల్స్ చూస్తూ వంట చేసేది. అవతలి బ్లాకులో ఎవరో ఎల్.సి.డి టి.వి కొనుక్కునేసరికి మా ఇంటికి రావడం తగ్గించి వేసింది. వారానికి కనీసం మూడురోజులయినా డుమ్మా కొట్టేది. ఆమె దగ్గర కంప్యూటర్ లిస్టు ఉందనుకుంటాను, ఒకసారి చెప్పిన కారణం మరోసారి చెప్పదు. ఒక్కోసారి నాకామె పనిమనిషో నేనామెకు పనిమనిషో అర్థం అయ్యేది కాదు. దీనివలన నాకు లాభం చేకూరిన మాట నిజం. ఆమె సమయానికి రాకపోవడం వలన నాకు మేలే జరిగింది. మా నాన్న తన ఆస్తి నా తమ్ముళ్ళకు రాసిచ్చి నాకు మటుకు చిల్లుకానీ ఆస్తి ఇవ్వకుండా చక్కెరవ్యాధి ఇచ్చాడు. దాని వలన సమయానికి కడుపులో ఏదో పడాలి. ఆకలికి తట్టుకోలేను. సునీత వస్తానన్న సమయానికి రాకపోతోంటే నమ్మకం పోయి వంట చేసుకోవడం మొదలెట్టాను. ఇప్పుడు అలవాటయిపోయింది. ప్రస్తుతం నా దగ్గరేం డబ్బులు తీసుకోవడం లేదు. అవసరమయినప్పుడు వందో, రెండొందలో తీసుకుంటుంది. నేను తిరిగి ఇవ్వమని గట్టిగా అడగను. ఇవ్వదు. పెదరావూరు ఖాతా అనుకుంటాను. సునీతను తీసేసి మరొకరిని పనిలో నన్ను పెట్టుకోనీయరు. వాళ్లకో అసోసియేషన్ ఉంది. మొండిగా

ఆమెను తీసేసి మరొకరిని పెట్టుకున్నా ఆమె పని సరిగా చేస్తుందనే నమ్మకం లేదు. ఇంట్లో ఉండేది నేను ఒక్కడినే అవటాన నాలుగయిదు ఇళ్ళల్లో పనిచేసి సమయం ఉంటే మా ఇంటికి వస్తుంది. అదీ మధ్యాహ్నం పూట నింపాదిగా. ఒకటి దాటాక వచ్చి, "అయ్యా, మన కోసం ఏ కూర చేసినారయ్యా?" అడిగి మిగిలింది లాగించేసి, "మా ఆయన కన్నా వంట బాగా చేస్తారయ్యా. మా అయ్య కంటే చాలా నయం అనుకో" అని కాంప్లిమెంటు విసురుతోంటే ఆమెను ఏమనలేక తల గోడకేసి కొట్టుకోవడం మొదలెట్టాను. నా తలకు ఏమయ్యేది కాదు. గోడలు మటుకు బీటలు వారాయి. తనకు ఏ కూరలు ఇష్టమో వంటగది గోడమీద పెన్సిలుతో రాసింది.

వంట చేసుకుందుకు నేను గిన్నెలు తోముకుంటే, తప్పు పట్టి, "ఇలానా గిన్నెలు తోముకోవడమా సారూ? మా ఆయనసలు విమ్‌లు గిమ్‌లు వాడకుండా ఎంత చక్కగా తోముతాడని? తళతళ లాడతాయంటే నమ్మండి. చూస్తే మీరే దంగయి పోతారు. మిమ్మల్ని ఒకసారి మా ఇంటికి తీసుకువెళ్ళాలి" అంటూండేది. రెండు మూడుసార్లు తన కూడా వాళ్ళింటికి తీసుకువెళ్ళడానికి ప్రయత్నించింది. వీలుకానీయలేదు. వాళ్ళాయనకు నన్నెక్కడ అప్రెంటీస్‌గా పెడుతుందేమోనని భయపడ్డాను.

ఇవేళ్టికి వేళ మా ఇంటికి వచ్చి నా ఇంటి ఫోనులో తెగ మాట్లాడేస్తోంటే బిల్లు పెరిగి పోతుందని, "ఎవరితో దాదాపు ముప్పావుగంటనుండి మాట్లాడుతున్నావు?" అడిగాను.

"మా ఆయనతో" అంది హోల్డు చేసి.

"మీ ఆయన ఇంట్లో లేడా?"

"ఇంట్లోనే ఉన్నాడు. పుదీనా పచ్చడి ఎలా చేయాలో చెప్తున్నాను."

"మీ ఇల్లు దగ్గరే కదా. నా ఫోను ఉపయోగించే బదులు ఇంటికి వెళ్ళాక మాట్లాడుకోవచ్చుకదా?"

"మేం పోట్లాడుకున్నాం. ఇంట్లో మాట్లాడుకోవడం లేదు"అంది.

పగుళ్ళు లేని గోడ నాకు కనిపించలేదు.

❖ ఆదివారం వార్త, జనవరి 2009